600 ఎకరాల తెలంగాణ భూమి కబ్జా!

మన రాష్ట్ర భూమిని లాక్కెళ్లిపోతున్న కర్ణాటక రైతులు

- ఏటా తెలంగాణ భూభాగం నుంచి ఇసుక తరలింపు
- తమ భూభాగమేనంటూ కర్ణాటక అధికారుల దబాయింపు
- కొన్నేండ్లుగా పెండింగ్‌లోనే 2 రాష్ట్రాల సరిహద్దు సమస్య
- పరిష్కారానికి సరిహద్దులో అటవీశాఖ అధికారుల సర్వే

విికారాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో తెలంగాణ భూభాగం ఆక్రమణకు గురైంది. మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని ఇస్మాయిల్‌పూర్ తదితర గ్రామాల పరిధిలో 600 ఎకరాల్లో అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి. ఎలాంటి ఆధారం లేకపోయినా తమ భూములేనంటూ గత కొన్నేండ్లుగా ఇక్కడి భూములను సాగు చేసేందుకు కన్నడ రైతులు ప్రయత్నాలు చేయడం, వికారాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం జరుగుతూ వస్తున్నది. ఆ రాష్ట్ర రైతులకు స్థానిక ప్రజాప్రతినిధుల అండ ఉంటంతో ఆక్రమణలు ఆగటం లేదు. ఎలాంటి పట్టాలు లేకపోయినా తమ భూములేనంటూ వారు తెలంగాణ అధికారులతో గొడవకు దిగుతున్నారు. మ్యాపుల్లో స్పష్టంగా తెలంగాణ భూభాగమేనని కర్ణాటక అధికారులకు తెలిసినా వారు ముందుకు వచ్చి వివాదాన్ని పరిష్కరించేలా ఆలోచించటం లేదు. దీంతో ఎట్టిపరిస్థితుల్లోనూ ఆక్రమణకు గురైన తెలంగాణ భూభాగాన్ని స్వాధీనం చేసుకునేందుకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.. రెండు రాష్ట్రాల సరిహద్దును గుర్తించి సమస్యను ఫుల్‌స్టాప్ పెట్టాలని అటవీ, రెవెన్యూశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో అటవీ శాఖ అధికారులు త్వరితగతిన సర్వే పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు. వారంలో పని పూర్తి చేసే దిశగా సాగుతున్నారు. అయితే, రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం సరిహద్దు సమస్య తేల్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని ఆక్రమణలకు గురైన ప్రాంతం (సర్కిల్)

సరిహద్దును నిర్ణయించకపోవటంతో వివాదం

ఒకప్పుడు కర్ణాటకలోని గుల్బార్గా జిల్లాలో వికారాబాద్ జిల్లా అంతర్భాగంగా ఉండేది. అనంతరం తెలంగాణలో భాగమైంది. అయితే, తెలంగాణ-కర్ణాటక మధ్య పకడ్బందీగా సరిహద్దులను నిర్ణయించకపోవటంతో సరిహద్దు వివాదం ఏర్పడింది. ఏటా వికారాబాద్ జిల్లా యంత్రాంగం సరిహద్దు సమస్య తేల్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నా కర్ణాటక అధికారులు మాత్రం స్పందించటం లేదు. 2017లో ఇరు రాష్ట్రాల మంత్రుల సమక్షంలో సమావేశం నిర్వహించి సరిహద్దుపై ఓ నిర్ణయానికి వచ్చినా.. మళ్లీ మొదటికొచ్చింది.

అక్రమంగా కర్ణాటక ఇసుక తరలింపు

కర్ణాటక ప్రభుత్వం ఏటా కాగ్నా నదిలోని రాష్ట్ర సరిహద్దు భూభాగం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నది. ఏటా కొత్త సరిహద్దులను సృష్టిస్తూ హద్దు దాటుతూ ఇసుక దోపిడీకి పాల్పడుతున్నది. బషీరాబాద్ మండలం క్యాద్గిర శివారులోని కాగ్నా నదిలో ఆ ప్రభుత్వం హద్దులు మీరి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నది. అయితే ఏడేండ్ల క్రితం బషీరాబాద్ మండలం క్యాద్గిర గ్రామం-సేడం తాలుకాలోని పోతంగల్ గ్రామాల మధ్యలోని కాగ్నా నదిలో భూభాగాన్ని సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయించటంతో కర్ణాటక భూభాగం వరకు ఆ రాష్ట్ర రెవెన్యూ అధికారులు.. హద్దులుగా కర్రలు పాతారు. ఆ తర్వాత ఆ ఆనవాళ్లు లేకుండా చేసిన సేడం రెవెన్యూ యంత్రాంగం.. మూడేండ్ల క్రితం జీపీఎస్ సర్వే అంటూ కాగ్నా నదిలో 70 శాతం భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు కొత్త హద్దులను సృష్టించింది. బషీరాబాద్ మండలంలోని క్యాద్గిర, గంగ్వార్ గ్రామస్థుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన వికారాబాద్ జిల్లా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం.. ఉమ్మడి సర్వే నిర్వహించి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. ఆ హద్దులను కూడా తుంగలో తొక్కిన కర్ణాటక.. తెలంగాణ భూభాగంలోని ఇసుకను తరలిస్తూ తెలంగాణ సంపదను కొల్లగొడుతున్నది.

తెలంగాణ-కర్ణాటక సరిహద్దు వద్ద హద్దులను గుర్తిస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

పెద్దాయనకు పరిహారం
పేదల బతుకు ఫలహారం

- సొంత పార్టీ నేత విల్లాను కూల్చేసిన కాంగ్రెస్ సర్కార్
- ఢిల్లీలో పెద్దాయన పంచాయితీ
- రాష్ట్రంలోని ముఖ్యనేతకు తలంటిన అధిష్ఠానం
- పరిహారంగా రూ. 30 కోట్లు
- మరో ఇంటికి వెళ్లబోమని హామీ
- కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడిదే హాట్ టాపిక్

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): హైడ్రా బుల్డోజర్లు పేద బతుకులను చిదిమేస్తున్నాయి. వీటి బారినపడినప్పటికీ పెద్దోళ్లు ఏదోలా బయటపడుతున్నా, పేదల జీవితాలే అతలాకుతలమైపోతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటి వరకు 23 ప్రాంతాల్లో 262 అక్రమ నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసున్నట్టు హైడ్రా ప్రకటించింది. ఇందులో 90 శాతం ఇండ్లు దిగవ మధ్య తరగతి, నిరుపేదలవే. పొద్దంతా కాయకష్టం చేసి రూపాయి, రూపాయి కూడ బెట్టుకొని కట్టుకున్న ఇండ్లు అవి. నోటీసులు లేకుండా పిడుగు వచ్చి మీద పడ్డట్టు కండ్ల ముందే కూలగొడుతుంటే కాళ్లా వేళ్లా పడి ప్రాధేయపడినా కనికరించకపోగా, పైపెచ్చు అధికారుల పనులకు ఆటంకం కలిగించారంటూ క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. అదే సమయంలో ఎదురు తిరిగిన పెద్దలకు మాత్రం ప్రైవేటుగా నష్టపరిహారాలతో హైడ్రా మోకరిల్లుతున్నది. హైడ్రా చేతిలో ఇటీవలే ఇంటిని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సమస్యను ఢిల్లీలోని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తే నష్టపరిహారం కింద రూ. 30 కోట్లు ముట్టజెప్పినట్టు తెలిసింది. అంతే కాదు, గండిపేట చెరువు కిందనే ఉన్న మరో ఇంటిని కూలగొట్టబోమనే హామీ ఇచ్చి బయటపడినట్టు కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చ జరుగుతున్నది.

ముఖ్యనేత మెడకు హైడ్రా

విపత్తు నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పనితీరు ముఖ్యనేత మెడకు చుట్టుకున్నది. గండిపేట చెరువు కింద పొరుగు రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఒకరు 9 ఏండ్ల క్రితం ఏడెకరాల స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. ఆ తర్వాత ఇంటి నిర్మాణ అనుమతులు తీసుకుని విలాసవంతమైన విల్లా కట్టుకున్నారు. హైడ్రా తొలిదశ కూల్చివేతల్లో సదరు నాయకుడి ఇల్లు నేలమట్టం చేశారు. విల్లాను కూల్చివేయడానికి వచ్చినప్పుడే ఆ నేత ఓ ప్రముఖ మంత్రిని సంప్రదించే ప్రయత్నం చేశారు. ఆయనకు పదేపదే ఫోన్లు చేసినప్పటికీ లిఫ్ట్ చేయలేదు. దీంతో మరో కీలక మంత్రికి ఫోన్ చేస్తే.. ఆయన తానేమీ చేయలేనని చేతులు ఎత్తేసినట్టు తెలిసింది. హైడ్రా మీద విమర్శలు వెల్లువెత్తడంతో 'ఇది కురుక్షేత్ర యుద్ధంతో సమానం. మా పార్టీ నేతల నుంచి కూడా నాకు ఫోన్లు వస్తున్నాయి. ఒత్తిళ్లు వస్తున్నాయి. వెనక్కి తగ్గేది లేదు. తప్పును సరి చేసుకునే సమయం ఇది.. సరిచేసుకోండి' అని సర్కారు ఒకింత గట్టిగానే హెచ్చరించినట్టు సమాచారం. ఈ హెచ్చరికలతో కంగుతిన్న సీనియర్ నాయకుడు నేరుగా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్‌ఖర్గేను కలిసి మొరపెట్టుకున్నారు. అన్ని అనుమతులు ఉన్న తన ఇంటిని అక్రమంగా కూల్చడమే కాకుండా తానో కబ్జాకోరును అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్టు ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. ఇప్పటి వరకు తనది మచ్చలేని రాజకీయ జీవితమని, జీవితం అంతా కాంగ్రెస్ పార్టీ కోసమే పనిచేశానని, సొంత ప్రభుత్వమే ఈ వయసులో తనపై కబ్జా ముద్ర వేసి సమాజం ముందు నిలబెట్టిందని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది.

హైకమాండ్ సీరియస్

ఫిర్యాదు నేపథ్యంలో వాస్తవ పరిస్థితులపై ఆరా తీసి, పంచాయితీ పరిష్కరించాలని పార్టీలో ఇటువంటి వ్యవహారాలు చూసే నాయకుడిని హైకమాండ్ పురమాయించినట్టు సమాచారం. రంగంలోకి దిగిన ఢిల్లీ నేత పార్టీ నాయకుల మీద ప్రతాపం సరికాదని, హైకమాండ్ సీరియస్‌గా ఉందని, మరోసారి పార్టీ నేతల నుంచి ఫిర్యాదులు వస్తే, పరిణామాలు తన చేతిలో ఉండవని గట్టిగానే హెచ్చరించినట్టు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఆంధ్రా కాంగ్రెస్ నాయకుడిని బుజ్జగించడానికి, తెలంగాణకు చెందిన ఒక సీనియర్ నాయకుడిని రాయబారానికి పంపగా ప్రభుత్వ చర్యల మీద ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. సదరు నేత వినకపోవడంతో రూ. 30 కోట్ల నష్టపరిహారంతోపాటు ఇప్పుడు కూలగొట్టిన ఫాంహౌస్‌ను ఆనుకొని ఉన్న ఆయన బంధువు విల్లా జోలికి ప్రభుత్వం పోదని హామీనివ్వడంతో సదరు నేత శాంతించినట్టు కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు.

అమరుడి భార్యకు అష్టకష్టాలు

- కానిస్టేబుల్ కిష్టయ్య భార్యపై కఠిన వైఖరి
- లైబ్రేరియన్‌గా పదోన్నతి కల్పించని సర్కారు
- ఆఫీసుల చుట్టూ 100 సార్లు తిరిగినా దక్కనిన్యాయం
- కేసీఆర్ తొలి సర్కారులోనే కుటుంబానికి ఆసరా
- ఇంటి స్థలం కేటాయింపు
- కూతురి ఉన్నత చదువులకు ఖర్చులు భరిస్తున్న బీఆర్ఎస్

హైదరాబాద్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంను కలిసి వినతిపత్రం ఇస్తున్న అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య భార్య పద్మావతి

హైదరాబాద్/కరీంనగర్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న రోజులు.. ఒకవైపు ఆమరణదీక్షలో ఉన్న ఉద్యమ సారథి కేసీఆర్ అరెస్టు.. పాలకుల అణచివేతలు.. ప్రత్యేక తెలంగాణ రాదేమోనన్న సంశయంతో కలతచెంది 'తన మరణంతోనైనా ప్రత్యేక తెలంగాణ సిద్ధిస్తుంది' అని తలచిన ఆనాటి తెలంగాణ ముద్దుబిడ్డ, కామారెడ్డికి చెందిన కానిస్టేబుల్ కిష్టయ్య 2009 డిసెంబర్ 1న తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ప్రత్యేక రాష్ట్రం కోసం బలిదానం చేసుకున్నాడు. ఆయన అమరత్వం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది. ఆ త్యాగధనుడి కుటుంబానికి గత పదేండ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచి, ఆసరా కల్పించింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కుటుంబంపై కాఠిన్యం ప్రదర్శిస్తున్నది. ఆయన భార్య ఉద్యోగ ప్రమోషన్ విషయంలో అవమానాల పాల్జేస్తున్నది. తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య భార్య యామ (పుట్టకొక్కుల) పద్మావతికి ఉద్యమ సమయంలోనే కారుణ్య నియామకం కింద ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విభాగంలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగం ఇచ్చారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక అమరుడు కిష్టయ్య కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చి ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచింది. కిష్టయ్య కూతురు ప్రియాంక ఎంబీబీఎస్ చదువు కోసం ఏడాదికి రూ.5 లక్షల చొప్పున బీఆర్ఎస్ పార్టీ చెల్లించింది. ప్రియాంక మెడికల్ పీజీ చదివేందుకు రూ.24 లక్షలను స్వయంగా కేసీఆర్ చెల్లించారు. ఉద్యోగం చేస్తూ, ఇద్దరు పిల్లలను చదివించుకుంటూనే పద్మావతి ఉన్నత విద్యను అభ్యసించారు. ఆమె విద్యార్హతలను బట్టి టైపిస్టుగా పదోన్నతి కల్పించారు. లైబ్రేరియన్ కావాలని, ఆ మేరకు అర్హతలు కూడా సాధించారు. కానీ సీనియారిటీ సరిపోక ఒక్క అడుగు దూరంలో ఆగిపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ అమరుడి భార్య తన ఉద్యోగ ప్రమోషన్ కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది.

తీరని అధికారుల హామీ

2023 సెప్టెంబర్‌లో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ శాఖ మల్టిజోన్-1 పరిధిలో పదోన్నతులకు అర్హులైన సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, లైబ్రేరియన్లను గుర్తించి ప్యానల్‌లో చేర్చింది. అప్పటికి లైబ్రేరియన్ ఖాళీ పోస్టులు 60 ఉండగా 10 శాతం అదనంగా అంటే 65 మందిని ఈ ప్యానల్‌లో చేర్చింది. పద్మావతి కంటే ముందు సీనియారిటీ ఉన్న 60 మందికి లైబ్రేరియన్లుగా పోస్టింగ్ ఇచ్చారు. సీనియారిటీ జాబితా ప్రకారం పద్మావతిది 61వ సంఖ్య. తన పదోన్నతి తృటిలో తప్పిపోవడంతో పద్మావతి ఉన్నతాధికారులను సంప్రదించారు. 60 మందిలో ఎవరైనా చేరకుంటే అవకాశం కల్పిస్తామని ఆ అధికారులు పద్మావతికి హామీ ఇచ్చారు. అనుకున్నట్టుగానే ఆ 60 మందిలో ముగ్గురు వ్యక్తిగత కారణాలతో లైబ్రేరియన్లుగా చేరడం లేదని సంబంధిత అధికారులకు రాతపూర్వంగా రాసిచ్చారు. ఈ నేపథ్యంలో తనకు ఎలాగైనా లైబ్రేరియన్‌గా పదోన్నతి వస్తుందని సంతోషపడిన పద్మావతికి ఆనాటి నుంచి ఇప్పటివరకు ఆ అవకాశం దక్కలేదు.

ఓ ఆంధ్రా అధికారి పక్షపాతం

ఇంటర్ విద్య కమిషనర్ శృతి ఓజా సహా ఇతర అధికారులను కలిసి తనకు న్యాయం చేయాలని పద్మావతి పలుసార్లు మొరపెట్టుకున్నది. ఇంటర్ విద్య కమిషనరేట్‌లోని ఓ ఆంధ్రా ప్రాంత అధికారిణి ఆమెకు పదోన్నతి కల్పించకుండా అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పద్మావతిని 100 సార్లు కార్యాలయం చుట్టూ తిప్పించుకొని తాజాగా 'ప్యానల్ ఇయర్ పూర్తయింది. నీకు పదోన్నతి ఇచ్చేదే లేదు. నీకు దిక్కున్న చోట చెప్పుకోపో' అని చెప్పినట్టుగా విశ్వసనీయ సమాచారం. కనీసం తన భర్త త్యాగాన్ని గుర్తించైనా తనకు పదోన్నతి కల్పించాలని వేడుకున్నా అధికారులు కనికరించలేదు. ఈ దయనీయ పరిస్థితుల్లో పద్మావతి ఇటీవలే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. తాను ఎదుర్కొన్న అవమానాలను విన్నవించుకుంటూ ఆయన ఎదుటే కన్నీటిపర్యంతమయ్యారు. కనీసం ఇపుడైనా ఆమెకు న్యాయం జరుగుతుందో లేదో వేచి చూడాలి.

పద్మావతికి న్యాయం చేస్తాం: బుర్రా వెంకటేశం

కానిస్టేబుల్ కిష్టయ్య భార్య పద్మావతికి న్యాయం చేస్తామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం భరోసా ఇచ్చారు. పద్మావతి పదోన్నతి విషయంపై 'నమస్తే తెలంగాణ' ఆయన్ను ఆరా తీయగా, ఇటీవలే తనను పద్మావతి కలిసి వినతిపత్రం ఇచ్చారని, పదోన్నతి కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామని, ఆమెకు తప్పకుండా న్యాయం చేస్తా చెప్పారు.

కరెంట్ కాటుకు ఇద్దరు రైతులు బలి

- గడ్డి కోస్తుండగా ఒకరు..
- స్టార్టర్ వైర్ తగిలి మరొకరు
- కామారెడ్డి జిల్లాలో విషాదం

కృష్ణ (ఫైల్)

ఎల్లయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట/రాజంపేట్, సెప్టెంబర్14: కరెంట్ షాక్‌తో ఇద్దరు రైతులు మృతి చెందారు. ఈ ఘటనలు కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట, రాజంపేట్ మండలాల్లో చోటుచేసుకున్నాయి. రాజంపేట్ మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన ముక్కిరి ఎల్లయ్య (41) శనివారం పొలానికి వెళ్లాడు. బోరు చుట్టూ గడ్డి ఏపుగా పెరగడంతో దాన్ని కోస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు కొడవలికి తగలడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డి గ్రామానికి చెందిన జోడు కృష్ణ (40) శుక్రవారం రాత్రి భోజనం చేసిన తరువాత ఇంట్లో చెప్పి పొలానికి వెళ్లాడు. శనివారం ఉదయం వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో భార్య చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. బంధువులు పొలానికి వెళ్లి చూడగా, కృష్ణ మోటర్ స్టార్టర్ డబ్బా వద్ద కరెంట్ తీగలకు వేలాడుతూ విగత జీవిగా కనిపించాడు. పొలానికి వెళ్తుండగా, కాలు జారి తీగలపై పడటంతో కరెంట్ షాక్‌కు గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కృష్ణ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డెంగ్యూతో చిన్నారి మృతి

సహస్ర (ఫైల్)

తనూశ్రీ (ఫైల్)

విషజ్వరంతో మరో చిన్నారి..

నర్సాపూర్/జఫర్‌గఢ్, సెప్టెంబర్ 14 : డెంగ్యూతో ఏడేండ్ల చిన్నారి మృతి చెందింది. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణానికి చెందిన జింకల నర్సింగ్, లహరి దంపతులకు ఏడేండ్ల బాలిక సహస్ర ఒకటో తరగతి చదువుతున్నది. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో నర్సాపూర్ దవాఖానలో వైద్యం అందించారు. శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లిన చిన్నారి సహస్ర అక్కడ సొమ్మసిల్లి పడిపోయింది. హుటాహుటిన హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ప్లేట్‌లెట్స్ పడిపోయి డెంగ్యూతో మరణించిందని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు.

విషజ్వరంతో చిన్నారి..

విషజ్వరంతో చిన్నారి మృతిచెందిన ఘటన జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం ఒబులాపూర్‌లో శనివారం చోటుచేసుకున్నది. ఒబులాపూర్ గ్రామానికి చెందిన వంగాల దయాకర్, శారద దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. చిన్నకుమార్తె వంగాల తనూశ్రీ(4)కి నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం హన్మకొండలోని ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. చిన్నారి డెంగ్యూతో మృతిచెందినట్టు స్థానికులు చెబుతున్నారు.

రియల్ ఢమాల్

మొదటిపేజీ తరువాయి...

కోరినట్టు లేఖ ఇవ్వడానికి అభ్యంతరం లేదని తెలిపారు. హైడ్రా నేరుగా నోటీసులు ఇవ్వదని, స్థానిక సంస్థల నోటీసులను బట్టి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇక, గ్రేహౌండ్స్, టాస్క్‌ఫోర్స్ తరహాలో హైడ్రా ప్రత్యేక అధికారాలతో చట్టబద్ధతను కలిగి ఉంటుందని.. అక్టోబర్‌లో ఆర్డినెన్స్ తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. 'ఎగ్జిక్యూటివ్ తీర్మానం ద్వారా తెలంగాణ ప్రభుత్వం 2024 జూలై 19న జీవో నంబరు 99 ద్వారా హైడ్రాను ఏర్పాటుచేసింది. నీరు, భూమి, చెట్లు (వాల్టా) చట్టం, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం, నీటి పారుదల చట్టం వంటి వాటి నుంచి వివిధ చట్టాల కింద అధికారాలు హైడ్రాకు అప్పగిస్తారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ప్రక్రియ జరుగుతున్నది. విధానపరమైన పత్రం సిద్ధమయ్యాక క్యాబినెట్ ఆమోదం కోసం పంపుతారు. క్యాబినెట్ తీర్మానం ఆమోదించిన 6 వారాల్లో శాసనసభలో ఆర్డినెన్స్ ఆమోదం పొందుతుంది' అని పేర్కొన్నారు.

నోటీసులిచ్చి దర్యాప్తు చేయండి

ప్రభుత్వ ఉద్యోగులపై హైడ్రా కేసులో పోలీసులకు హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): చెరువుల ఆక్రమణలకు సహకరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు నోటీసులు ఇచ్చి, వివరణ తీసుకున్న తర్వాతే చట్టానికి అనుగుణంగా దర్యాప్తు చేపట్టాలని సైబరాబాద్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఆక్రమణలను ప్రోత్సహించారని ఆరోపిస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఉద్యోగులపై గత నెల 30న సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని మేడ్చల్ మల్కాజిగిరి సర్వే డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, మరో ఉద్యోగి పూల్‌సింగ్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ సుజన విచారణ జరిపారు. పిటిషనర్లపై నమోదైన అభియోగాలన్నీ ఏడేండ్లలోపు శిక్ష పడేవైనందున వారికి బీఎన్ఎస్ఎస్‌లోని 35(3) సెక్షన్ కింద నోటీసులు జారీచేసి, వివరణ తీసుకోవాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. నిందితుల ఆధారాలను పరిగణనలోకి తీసుకుని, మెజిస్ట్రేట్‌కు సమర్పించే తుది నివేదికకు జత చేయాలని ఆదేశిస్తూ.. పిటిషన్లపై విచారణ ముగిసినట్టు ప్రకటించింది.

20న క్యాబినెట్ సమావేశం

కొత్త రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, హైడ్రాపై చర్చించే అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఈ నెల 20న క్యాబినెట్ సమావేశం జరుగనున్నది. సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, హైడ్రాకు మరిన్ని అధికారాలు, రూ.2 లక్షలపైన రుణమాఫీకి సంబంధించి విధి విధానాలు తదితర అంశాలపై చర్చించే అవకాశమున్నది.

ఏచూరి మృతి తీరని లోటు

దళిత్ రైట్స్ కోఆర్డినేషన్ కమిటీ నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి మృతి దేశంలోని దళిత, ఆదివాసీలకు తీరని లోటని దళిత్ రైట్స్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఏచూరి మృతికి సంతాపం తెలియజేస్తూ కమిటీ సభ్యులు మల్లేపల్లి లక్ష్మయ్య, బీ వెంకట్, రామచంద్ర డోమ్, వీఎస్ నిర్మల్, ధీరేంద్రఝా, గుల్జర్‌సింగ్ గోరియా, కర్నాల్‌సింగ్, బీనా పల్లికరి, సాయిబాలాజీ, విక్రమ్ సింగ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత, ఆదివాసీల హక్కుల కోసం ఏచూరి చేసిన కృషిని స్మరించుకున్నారు.

28న గురుకులాల్లో చాక్ డౌన్

- సమస్యల పరిష్కారానికి దశలవారీగా పోరాటం
- స్పందించాలని సర్కారుకు గురుకుల జేఏసీ అల్టిమేటం



హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ, జనరల్ మొత్తంగా ఐదు సొసైటీ పరిధిలోని గురుకులాల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 28న చాక్ డౌన్‌కు గురుకుల విద్యా జేఏసీ పిలుపునిచ్చింది. ప్రభుత్వం వెంటనే స్పందించాలని అల్టిమేటం జారీ చేసింది. గురుకుల జేఏసీలో భాగస్వామ్యమైన టీఎస్‌డబ్ల్యూఆర్టీఈఏ అధ్యక్షుడు సీహెచ్ బాలరాజు, స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుదాస్, టీఎస్‌డబ్ల్యూఆర్టీయూ బాలస్వామి, ఏటీజీఆర్ఐ ఈడబ్ల్యూఏ యాదయ్య, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ చలపతి, టీటీఆర్ఈఐటీఏ రుషికేష్‌కుమార్, టీఆర్ఈఐటీఏ గోవర్ధన్‌రెడ్డి, టీఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఝాన్సీ రాణి, టీఆర్‌డీసీఈఏ సాంబలక్ష్మి, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈటీఎల్ఏ ఆవుల సైదులు, పీడీ అసోసియేషన్ వీ చందర్ శనివారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. గురుకుల విద్యార్థులతోపాటు ఉపాధ్యాయ, ఉద్యోగవర్గం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నదని, ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం స్పందించడం లేదని విద్యాజేఏసీ వాపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళన బాట పట్టాల్సి వస్తున్నదని వివరించింది. సమస్యల పరిష్కారానికి దశలవారీగా శాంతియుతంగా ఆందోళనలను చేపట్టాలని నిర్ణయించినట్టు వెల్లడించింది. 17న నల్లాబ్యాడ్జిలతో, 19న ఉపాధ్యాయులంతా సంతకాలు చేసి ఆ వినతులను ప్రిన్సిపాల్స్ ద్వారా సొసైటీ కార్యదర్శులకు సమర్పించాలని నిర్ణయించింది. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే పెన్‌డౌన్, చాక్‌డౌన్‌లో భాగంగా 28న విధులను బహిష్కరించాలని గురుకుల ఉపాధ్యాయులకు జేఏసీ పిలుపునిచ్చింది.

గురుకుల జేఏసీ ప్రధాన డిమాండ్లు..

- ప్రభుత్వం ఇటీవల అమలులోకి తీసుకువచ్చిన నూతన పనివేళలను తక్షణమే మార్చాలి. గతంలో తరహాలోనే పనివేళలను కొనసాగించాలి.
- జీవో 317 అలకేషన్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి.
- అన్ని గురుకులాల్లో శాశ్వత కనీస మౌలిక వసతులను కల్పించాలి